# నిలబడగలవా!



పులిగడ్డ చలమయ్య చుట్టపు చూపుగా అమరావతిలో అడుగుపెట్టడానికి కొంచెం ముందో, వెనకో గొప్ప ముసురు. మూడురోజుల తుపానులో ఇళ్ళు పడి పోయినాయి. చెట్లు విరిగిపోయినాయి. తెరిపిచ్చింది. పరవాలేదనుకుంటే

పులిగడ్డ చలమయ్యచేతి చలవ అనాలో, పాద ప్రతిభ అనాలో అవాంతరాలు ఒకటి తర్వాత ఒకటి వరసగా వచ్చిపడ్డాయి.

రామాలయం అరుగుమీద కూర్చుంటే పుల్లయ్య చలమయ్యని పలకరించి 'అయ్యా! ఆ గోడపక్క స్థలం ఎవరిదీ?' అనడిగాడు.

చలమయ్య పుల్లయ్యని పైకి, కిందకీ చూసి 'మవ్వు నిలబడతావా?' అనడిగాడు.
'అంటే?' అన్నాడు పుల్లయ్య.

'నువ్వు నిలబడతావా అన్నాను. నిలబడగలిగితే చెప్పు' అన్నాడు చలమయ్య.

'నిలబడమంటే నిలబడతాను' అన్నాడు అర్థంకాక పుల్లయ్య.

'నిలబడితే ఆ స్థలం నీదే' జేబులో పెట్టినట్టు తేల్చేశాడు చలమయ్య.

'అంటే' అని నోరెళ్ళబెట్టాడు పుల్లయ్య.

'అలా నోరు తెరవకు. ఇంటికెళ్ళి వంద పట్రా. గుంటూరు బస్సు రెడీగా ఉంది. పద పోదాం అనటమేమి వందతో గుంటూరు వెళ్ళిపోయి, ప్రస్తుతం పోరంబోకుగా ఉన్న ఆ స్థలం మూడు తరాల క్రితం పుల్లయ్య వంశానికి చెందినట్టు కాగితం సృష్టించి, నోటీసు లిప్పించి పత్రికల్లో ప్రకటనలు వేయించి, వూళ్ళో టముకు కొట్టించి, దావా ఎవరూ ప్రతిఘటించక పోవటంతో, తను మరో ఐదొందలు జేబులో వేసుకుని ఆ స్థలాన్ని ఆర్నెల్లలో పుల్లయ్య చేతిలో పెట్టాడు.

ఆ తర్వాత చలమయ్య పులిగడ్డ వెళ్తానన్నా జనం వెళ్ళనివ్వలేదు. కేసుల్లేని రోజు లేదు. పడిపోయిన కేసుల్ని నిలబెట్టి ప్రాణంపోసి మీసం తిప్పేలా గెలిపించి ప్లీడర్లని హడలగొట్టించాడు.

ఈలోపున మరో గృహకల్లోలం వచ్చింది. సుందరయ్య అనే వ్యాపారస్తుడు వ్యాపారం నిమిత్తం ఆ పట్నం, ఈ పట్నం తిరుగుతున్న సమయంలో అలివేలు అనే ఆవిడ ఆయనకు తటస్థపడ్డది. ఏం జరిగిందో మనకైతే తెలియదుగాని

ఆవిణ్ణి తీసుకొచ్చి గుంటూరులో కాపురం పెట్టించి తను రోజూ గుంటూరు వెళ్ళి వస్తూండేవాడు. కొంతకాలానికి మరికొంచెం ధైర్యంచేసి అమరావతికే తీసుకొచ్చి కాపురం పెట్టి వ్యవహారం సాగించటం మొదలెట్టాడు. ఎదిగొచ్చిన కొడుకులు, కూతుళ్ళు, భూదేవిలాంటి భార్య అందరూ ఉన్నా, ఒక్కరూ నోరెత్తలేకపోయారు. వూరి పెద్ద కాబట్టి జనం ఎవరూ వేలెత్తలేకపోయారు. ఆఖరికి సుందరయ్య భార్య చలమయ్య దగ్గరకొచ్చి 'అన్నా నా పసుపుకుంకుమ నిలుపు. నా సంసారం నిలబెట్టు' అని ప్రాధేయపడితే 'సరే' అని అభయమిచ్చాడు చలమయ్య.

ఆ సాయంత్రం సరాసరి అలివేలు ఇంట్లోకి వెళ్ళి 'అమ్మాయ్! అలివేలూ ఏమిటి అలా చూస్తావ్? మన సుందరాయ్ నా గురించి చెప్పలేదా ...... సరే తర్వాత తెల్లబోదువుగాని ...... ముందు కాసిని మజ్జిగ తీసుకురా ..... ' అని తెచ్చిన మజ్జిగ తాగి 'ఇదిగో ....... నా మాట జాగ్రత్తగా విను. నువ్వు పరాయిపిల్లవైనా మా సుందరాయ్‌కి కావలసిన దానివి అంటే నాకు చెల్లెలితో సమానం. నీకిప్పుడు పెద్ద ప్రమాదం వచ్చింది.

'అదేవిటండీ!' అంది అలివేలు భయంగా.

"మనుషులిష్టం లేకపోతే పోవచ్చు. కాని ఖూనీలు, రక్తపాతాలు నాకు పడవు."

అలివేలు గుండెలమీద చెయ్యేసుకుంది.

"సుందరయ్య ఇరవైవేలదాకా ముట్టచెప్పాడా? నిన్న రాత్రి వజ్రపుటుంగరం స్వయంగా నీ చేతికి తొడిగాడా!"

'నిజం' అని ఆశ్చర్యపోయింది అలివేలు. ఆ ఉంగరం గురించి వాళ్ళిద్దరికీ తప్ప ఇంకెవరికీ తెలియకపోవటంతో చలమయ్య మీద నమ్మకం కుదిరింది.

'చెప్పండి ...... విషయం ఏవిటీ?' బిక్కు బిక్కు మంటూ అంది.

"చెప్పటమెందుకూ ...... ఆ కిటికీలోంచి చూడు" అన్నాడు చలమయ్య.

కిటికీలోంచి చూస్తే సంజె చీకట్లో చెట్ల వెనకాల నల్లగా మనుషులు తిరుగుతున్నారు. అలివేలుకు గుండెలవిసిపోయాయి.

"నీ విషయం సుందరాయ్ బావమరిదికి తెలిసింది. మీ ఆయన లేని సమయం చూసుకొని నిన్ను సఫా చెయ్యటానికి మనుషుల్ని తీసుకొచ్చాడు. అయినదానివి కదాని ముందుగా చెప్దామని వచ్చా" అన్నాడు.

"నన్ను రక్షించండి బాబోయ్" అంటూ కాళ్ళమీద పడిపోయింది అలివేలు. "కంగారు పడకు. నేను అన్నీ ఏర్పాట్లు చేసే వచ్చా, దొడ్డి వాకిలి దగ్గర చిన్న కారుంది. క్షణంలో సర్దుకుని అందులో పడు. వెనక్కి చూడకు. ప్రాణాలు కాపాడుకో." అన్నాడు చలమయ్య.

మరునిమిషంలో అందిన సామానుతో కారులో పారిపోయింది అలివేలు. సరాసరి సుందరయ్య ఫ్యాక్టరీకి వచ్చాడు చలమయ్య. 'సుందరయ్యా చెబితే విన్నావా? తెలియని వాళ్ళతో మనకు పొందువద్దయ్యా అని నెత్తీ నోరు పెట్టి మొత్తుకున్నానా. వాడెవడో మైసూరునుంచి వచ్చాట్ట. ఆ ముండ కారులో ఉడాయించేసింది." అన్నాడు.

"ఆ!" అన్న సుందరయ్యని చెయ్యి పట్టుకు లేపుకొచ్చి ఖాళీ ఇల్లు చూపించాడు చలమయ్య. ఆ మర్నాడు సుందరయ్య సతీసుత సమేతంగా గుళ్ళో అభిషేకం చేసుకుని పసుపునీళ్ళు నెత్తిన చల్లుకున్నాడు.

చలమయ్యకు ఆఖరి దశలో పక్షవాతం వచ్చింది. ఆ అదనుచూసుకుని ఉన్న మూడెకరాలకూ వారసులు దావా వేశారు.

తను నిలబడలేడు. మాట కూడా పోయింది. 'హన్నన్నా!' అందర్నీ నిలబెడతావా?' అని ఆ రోజుల్లో నిలబెట్టి నడిపించిన నేనే, ఈ దశలో నిలబడ లేకపోతినే అని వాపోయాడు. మిగిలిన సగం ఆస్తితో తన కొడుకులనయినా నిలబెట్టమని దేవుడికి మొక్కాడు.*